పక్కాగా పశువుల లెక్క


సవరడ్డపనసలో పశుగణన చేస్తున్న ఎన్యూమరేటర్లు

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పశు గణన
- 185 గ్రామాల్లో 70,200 గృహాల్లో సర్వే..


చిన్నగుజ్జువాడలో ఉన్న పశువులు

సారవకోట: నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో పశుగణన ప్రారంభమైంది. నాలుగు మండలాల్లోని 70,200 గృహాల్లో సర్వే చేపట్టనున్నారు. గేదెలు, ఆవులు, దూడలు, ఎద్దులు, కోళ్లు, కుక్కలు, పందులు, గొర్రెలు, మేకలు తదితర జంతు జీవజాలంపై ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం 16 రకాల జీవాలపై సర్వే సాగుతోంది. ఇందు కోసం మొత్తం 31 మంది ఎన్యూమరేటర్లను

నరసన్నపేట నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామాలు, గృహాల వివరాలు			
మండలం	ఎన్యూమరేటర్లు	రెవెన్యూ గ్రామాలు	గృహాలు
సారవకోట	5	43	14,082
జలుమూరు	7	54	16,595
పోలాకి	8	42	17,794
నరసన్నపేట	11	46	21,729

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నియమించడం జరిగింది. 2011 లెక్కల ప్రకారం సర్వే జరుగుతున్నప్పటికీ కొత్తగా వచ్చిన గృహాల్లోనూ ఉన్న జీవాలను లెక్కించనున్నారు. నవంబర్ 1 నుంచి ప్రారంభమైన పశుగణన వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు సాగనుంది. రోజూ సుమారు 30 ఇళ్ల వరకు సర్వే చేయాలి. ఒక్కో ఎన్యూమరేటర్ పరిధిలో గ్రామాల్లో 2 వేల గృహాలు, పట్టణ ప్రాంతాల్లో 6 నుంచి 7 వేల ఇళ్లకు వెళ్లి జంతువులతో పాటు వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ సంబంధించిన యంత్రాలను లెక్కించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

పశు పోషకులకు మేలు..

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా సాగుతున్న ఈ సర్వేతో పశు పోషకులకు మేలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. పాడి పశువులు, ఆవులు, పాల ఉత్పత్తి, వాటికి కావాల్సిన మందుల బడ్జెట్, మాంసం ఉత్పత్తిని పెంచేందుకు సర్వే దోహదపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. గ్రామస్థాయిలో ఉండే పశువైద్య సిబ్బంది రోజువారీ సేవలందిస్తూనే మిగిలిన సమయాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. పూర్తిచేసిన ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తారు. అలాగే వారి శాఖకు సంబంధించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.

అన్ని విధాలా ఉపయోగం



నరసన్నపేట నియోజకవర్గంలో శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు, సిబ్బంది పశుగణన సర్వే చేస్తున్నారు. 31 మంది ఎన్యూమరేటర్లు గ్రామాల్లోని పెంపుడు జంతువుల వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా పాల, మాంసం ఉత్పత్తి ఎంతవరకు వస్తుందో తెలుస్తుంది. పశువులకు అవసరమైన మందుల బడ్జెట్ అంచనా వేసుకోవచ్చు. రైతులు ఈ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలి.

– ఎం.లోకనాథం, పశు సంవర్ధకశాఖ ఏడీ, సారవకోట

కృష్ణదాస్‌ను కలిసిన చింతాడ

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను పోలాకి మండలంలోని మబగాంలో ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులతో కలిసి వచ్చి ఆమదాలవలస నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. అందరితో సమన్వయంగా ముందుకు వెళ్లాలని, పార్టీని మరింత పటిష్టపరచాలని రవికుమార్‌కు కృష్ణదాస్ సూచించారు. రవికుమార్ వెంట బూర్జ మండలం పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, నాయకుడు సురవవరపు నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.


ధర్మాన కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు

పోలీసులకు మీడియా సహకరించాలి

మెళియాపుట్టి: శాంతిభద్రతలు కాపాడటానికి మీడియా ప్రతినిధులు సహకారం అవసరమని పాతపట్నం సీఐ రామారావు, మెళియాపుట్టి ఎస్‌ఐ రమేష్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు మత్తుపదార్థాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నేరాల నిరోధం, కేసులు కొలిక్కి రావడం కోసం పోలీసులు తీసుకుంటున్న ప్రతి చర్యనూ మీడియా ప్రజలకు వివరిస్తోందని, పోలీసులు చేసిన కార్యక్రమాలను ప్రచురించడంతో ప్రజల్లో మరింత విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రచురితమవుతున్న పలు అసత్య ప్రచారాలకు మీడియాలో వచ్చిన వార్తల వల్లనే చెక్ పెట్టవచ్చునన్నారు. ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో నిఘా పెంచామని, మత్తుపదార్థాల రవాణా గూర్చి, ఇతరత్రా వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పలువురు పోలీసులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ రామారావు, ఎస్‌ఐ రమేష్‌బాబు

ఓటుహక్కు నమోదు చేసుకోండి


నరసన్నపేట:126వ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓతో మాట్లాడుతున్న ఆర్వో లావణ్య


పాతపట్నం: కాపుగోపాలపురంలో ఓటుహక్కు నమోదు చేసుకుంటున్న దృశ్యం


నరసన్నపేట: అర్హులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నరసన్నపేట ఆర్వో ఎం.లావణ్య అన్నారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులను పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు నిర్వహించారు. ఆదివారం వీటిని పరిశీలించి బీఎల్‌ఓలకు తగిన సూచనలు చేశారు. పట్టణంలోని 126, 128, 133, 135, 136వ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కొత్తగా ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. ఇటీవల ఓటర్ల జాబితా డ్రాఫ్టను పబ్లికేషన్ చేశామని, వాటిలో తప్పొప్పులు సరిచేసుకోవచ్చన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు బీఎల్‌ఓల వద్ద ఫారం–6లు ఉంటాయని, వీటితోపాటు టెన్త్ మార్కుల జాబితా, ఫొటో జత చేసి ఇవ్వాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డీటీ శరత్, ఎన్నికల విభాగం క్లర్క్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదు సామాజిక బాధ్యత

పాతపట్నం: ఓటు హక్కు పొందడం సామాజిక బాధ్యత అని, 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ బి.వి.రమణ అన్నారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి..

ఎల్.ఎన్.పేట: కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు, ఓటర్ల జాబితాల్లోని తప్పులను సరి చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పూర్తి నివేదికను ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని బీఎల్‌ఓలకు తహసీల్దారు జె.ఈశ్వరమ్మ సూచించారు. ఆదివారం ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటు హక్కు కల్పించాలన్నారు. ఆర్‌ఐ ఎస్.గవరయ్య, వీఆర్వో లుకలాపు తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎల్.ఎన్.పేట: వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

సైబర్ మోసాలపై అప్రమత్తం

పాతపట్నం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం ఎస్‌ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని తెంబూరు గ్రామంలో పోలీసులు ఆధ్వర్యంలో సంకల్ప కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ సింహాచలం పాల్గొన్నారు.

బూర్జ: సెల్ ఫోన్ వినియోగం వలన అనర్థాలు ఎక్కువగా వస్తున్నాయని, ఆరోగ్య సమస్యల పట్ల తీవ్ర ప్రభావం కలుగుతుందని ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక అన్నారు. మండలంలోని లక్కుపురం గ్రామంలో ఆదివారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. సత్ప్రవర్తనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ కర్నేన దీప, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సారవకోట: మండలంలోని గొర్రిబంద గ్రామంలో సైబర్ నేరాలపై ఎస్‌ఐ అనిల్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్ నేరాల సంఖ్య పెరిగిందని, దీని నివారణకు ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. ఎవరు ఫోన్ చేసినా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ చెప్పవద్దన్నారు.

సరుబుజ్జిలి: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని స్థానిక హెచ్‌సీ జనార్దనరావు తెలిపారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. కానిస్టేబుల్ సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణితంపై భయం వీడాలి


గణిత టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గణితంపై భయాన్ని పోగొట్టి వారిలో ఆసక్తిని పెంచేందుకే గణిత టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని గణిత ఉపాధ్యాయులు సైలజ, భానుప్రకాశ్, పల్లి రమేష్, ఈశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత (బొర్డు) పాఠశాలలో మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో టాలెంట్ పరీక్ష నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి పంపుతామని ఉపాధ్యాయులు తెలిపారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు చెప్పారు.

తెలగ కులస్తులను బీసీల్లో చేర్చాలి


మాట్లాడుతున్న వెంకటరామారావు

ఆమదాలవలస: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని తెలగ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నాయకుడు పల్లంటి వెంకటరామారావు డిమాండ్ చేశారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మన్నయ్యపేట ఉద్యానవనంలో ఆదివారం జిల్లా సంఘం ఏర్పాటు చేసిన ఆత్మీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ విషయంలో చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా బీసీ సాధన సమితి ఉత్తరాంధ్ర జేఏసీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రొక్కం సూర్యప్రకాష్‌రావు, అత్తులూరి మురళీమోహన్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పందెం కోళ్ల వేలం


పందెం కోళ్లకు వేలంపాట నిర్వహిస్తున్న పోలీసులు

నరసన్నపేట: స్థానిక పోలీసు స్టేషన్‌లో 8 పందెం కోళ్లకు ఆదివారం వేలంపాట నిర్వహించారు. వీటి ద్వారా రూ.25,560 ఆదాయం వచ్చిందని నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని లుకలాం వద్ద జీడితోటల్లో కోడిపందాలు నిర్వహిస్తున్న ముఠాపై ఇటీవల నరసన్నపేట పోలీసులు దాడి చేయడం తెలిసిందే. దీంట్లో 8 కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో 20 మంది పాల్గొన్నారు. నలుగురు వ్యక్తులు ఈ కోళ్లను వేలంలో పొందారు. వేలం పాట పోటాపోటీగా సాగింది.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం


వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు స్కూల్ పరిసరాలతో పాటు జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న వివేకానందుడి విగ్రహం చుట్టూ ఉన్న అపరిశుభ్రతను తొలగించారు. అంతకు ముందు ఎన్‌సీసీ ఏఎన్‌ఓ దంత లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ గుర్తింపు వివరించారు. క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అన్నారు. ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి గుర్తింపు వస్తుందని, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఎన్‌సీసీ బాలికల కేర్ టేకర్ తులసీ, ఉపాధ్యాయుడు సాయి శ్రీనివాస్, తదితరులు ప్రసంగించారు. వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముమ్మరంగా రైల్వే విద్యుత్ లైన్ పనులు


రైల్వే విద్యుత్ లైన్ పనులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: పర్లాకిమిడి (ఒడిశా) నుంచి నౌపడ వరకు రైల్వే విద్యుత్ ఆధునికీకరణ పనులు, రైల్వే ట్రాక్ పనులు ఆదివారం చేపట్టారు. స్పీడ్ ట్రాక్ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్, ట్రాక్ పనులు రైల్వే అధికారుల ఆధ్వర్యంలో గంగువాడ నుంచి పర్లాకిమిడి మార్గంలో నిర్వహించారు. పర్లాకిమిడి నుంచి నౌపడకు ఈ మార్గంలో రైలు 50 కిలో మీటర్ల స్పీడ్ ఉండేది. ఈ పనులు పూర్తయితే రైలు స్పీడ్ 75 కిలో మీటర్లకు పెరగనుందని రైల్వే అధికారులు తెలియజేశారు.

శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు: శ్రీముఖలింగంలోని మధుకేశ్వర స్వామిని కార్తీక మాసం ఆఖరి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వేకువ జామునుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భీమేశ్వర, సోమేశ్వర ఆలయాలలో కూడా భక్తుల రద్దీ నెలకొంది. జిల్లా నలుమూలలతోపాటు విజయనగరం, విశాఖపట్నం, ఒడిశాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చలో శ్రీకాకుళం విజయవంతం చేయాలి

బూర్జ: ఈ నెల 29వ తేదీన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను (చలో శ్రీకాకుళం) విజయవంతం చేయాలని మాలమహానాడు మండల అధ్యక్షుడు కంట కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో మాల ఉపకులాల ఉద్యోగులు, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

సరుబుజ్జిలి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న శ్రీకాకుళం పట్టణంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని దళిత మహాసభ నేతలు ఎడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరినాయుడు, గుర్రాల చిన్నబాబు, ఇల్లాకుల ప్రకాశరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేయాలని కోరారు.

శరవేగంగా కేజీబీవీ తరగతి గదుల నిర్మాణం


అదనపు తరగతి గదులు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.93.94 లక్షలతో ఎనిమిది అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేస్తున్నామని ఐటీడీఏ డీఈఈ బి.శిమ్మన్న ఆదివారం తెలిపారు. కేజీబీవీలో ఇంటర్ కూడా నిర్వహించడంతో అదనపు తరగతి గదులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని, ప్రస్తుతం మొదటి ఫ్లోర్ పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు.

నేడు రేబీస్ నివారణ టీకాలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి మోనింగివారి వీధిలోని పశువైద్య కార్యాలయం వద్ద వీధి కుక్కలకు సోమవారం రేబీస్ నివారణ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ ఆర్.ఆనందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో కుక్కలు పట్టించి వాటికి టీకాలు వేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. టీకాలు, తగిన మందులు తమ కార్యాలయం నుంచి సప్లయ్ చేస్తామన్నారు. పశుసంవర్ధకశాఖ నుంచి సిబ్బంది వచ్చి టీకాలు వేస్తారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 200 కుక్కలకు వ్యాక్సిన్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఉదయం పది గంటల నుంచి వ్యాక్సిన్‌లు వేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ టీకాలు వేస్తున్నామన్నారు.

18 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామానికి చెందిన మహిళ వద్ద 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. ఆదివారం కొరసవాడ గ్రామంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా గ్రామానికి చెందిన మహిళను మద్యం బాటిళ్లతో పట్టుకున్నామని కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

శిథిల భవనంలో విధులు



సరుబుజ్జిలి మండలం షళంత్రిలో పశువైద్య ఉప కేంద్రానికి పక్కా భవనం లేకపోవడంతో పాడైన గదిలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏమాత్రం వర్షం కురిసినా శ్లాబ్ పైనుంచి నీరు లోపలికి చేరి మందులు, వస్తువులు, రికార్డులు పూర్తిగా పాడవుతున్నాయి. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించి, పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి తీసుకురావాలని పాడి రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

ఆరుబయటే వంట



బూర్జ మండలంలోని పాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట గది నిర్మించకపోవడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు రేకుల షెడ్డులోనే వంట చేస్తున్నారు. వర్షాకాలం ఇబ్బంది పడుతున్నారు. వండిన పదార్థాలు కుక్కలు, క్రిమికీటకాల వలన పాడయ్యే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే వంట గదిని నిర్మించాలని కోరుతున్నారు.

– బూర్జ

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..



నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న రైతు సేవా కేంద్రం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా ఉంది. గత ప్రభుత్వ కాలంలో దీనిని నిర్మాణం చేపట్టగా.. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. 20 శాతం పనులు చేయాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో పనులు ముందుకు వెళ్లడం లేదు. దీంతో ముళ్ల పొదలు పెరిగి ప్రస్తుతం ఈ భవనం జూదం, మద్యం, తదితర అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అధికారులు స్పందించి భవనం నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

దుప్పట్ల పంపిణీ



కొత్తూరు మండలంలోని కర్లెమ్మకు చెందిన ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ చారటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు గోపాలదాసునాయుడు ఆదివారం కర్లెమ్మలో పలువురి గిరిజనులకు దుప్పట్లతోపాటు కొంత మొత్తం నగదు అందజేశారు. గోపాలదాసునాయుడు తల్లి వరహాలమ్మ జ్ఞాపకార్థం (వర్ధంతి సందర్భంగా) 75 మంది గిరిజనలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

– కొత్తూరు

సందడిగా కార్తీక వనమహోత్సవం


ఆమదాలవలస: వృద్ధులను సన్మానిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు వాసు, సభ్యులు


పొందూరు: సత్కారం పొందిన విశ్రాంత ఉద్యోగులు

ఆమదాలవలస: ఆమదాలవలస తాలూకా శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనమహోత్సవాన్ని గేదెలవానిపేట జంక్షన్‌లో గల ఉమామహేశ్వర స్వామి ఆలయం సమీపంలోని తోటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రస్తుతం ఉన్న సంఘ సభ్యులనే మరో రెండేళ్లు కొనసాగించడానికి 500 మంది శిష్ట కరణ సభ్యుల సమక్షంలో తీర్మానం చేశారు. అధ్యక్షుడిగా బి.వి.ఎస్.ఎన్.మూర్తి, ప్రధాన కార్యదర్శిగా బలివాడ మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 75 ఏళ్లు దాటినవారికి జిల్లా అధ్యక్షుడు డబ్బీరు వాసు సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కె.వి.రాజారావు మాస్టారు నిర్వహించిన 'మంచం మీద మనిషి' అనే హాస్య నాటిక ఆకట్టుకుంది.

సేవలే గుర్తింపునిస్తాయి.

పొందూరు: సమాజానికి సేవలందించే వారికి ఎల్లప్పుడూ సముచిత గౌరవం లభిస్తుందని లయన్స్ అంతర్జాతీయ నిధి సమన్వయకర్త, విశ్రాంత ఎంపీడీఓ కుప్పిలి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక విశిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎంలు దివాకర్ పాత్రో, వాండ్రంగి ఉమాశంకర్, విశ్రాంత తహసీల్దార్ బలివాడ గోవిందరావును సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పిలి రవికుమార్, వి.దామోదరావు, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం చేపట్టాలి


ఆధ్యాత్మిక సత్సంగంలో పాల్గొన్న వక్తలు

సారవకోట: ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేపట్టాలని విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన ప్రవచనకర్త అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన్ సమాజం ఆధ్వర్యంలో 100వ ఆధ్యాత్మిక సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీతలో మనం నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించాలని, దీని వలన ప్రజల్లో ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. కూర్మినాయుడు, మురళి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. వారణాశి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు.

26న సహస్ర దీపారాధన

హిరమండలం: ఈ నెల 26న చిన్నకోరాడలో గల అభయాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సహస్ర దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు జోస్యుల గోవిందశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.